# భం గురువాణి

13 ఆగస్టు, 2026 సంచిక-265



## స్వార్థపరులు

"ముష్కిల్ మే కామ్ ఆనే వాలా హీ ఇన్సాన్ కి ఇన్సాన్" కష్ట సమయంలో మనిషికి మనిషి తోడ్పడాలి. అదే పూజ, అదే యోగం, అదే ధ్యానం, అదే నమాజు అని పెద్దలు అంటారు. కనుక ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలి. కనీసం మనిషి మనిషిగా బ్రతికేది నేర్చుకోవాలి. ఈనాడు వైజ్ఞానికంగా ఎదిగినటువంటి మానవుడు ఆకాశంలో విహరించగలడు, చంద్రుని దగ్గరకు సునాయాసంగా పోగలడు, నీటిలో చేప మాదిరిగా ఈదగలడు, అయితే అదే మానవుడు మానవత్వాన్ని పెంచుకొని భూమి మీద మానవుడు మానవునిగా బ్రతికేది నేర్చుకోవాలి.

పరుల సొమ్మును ఆశించకూడదు, అయితే దానిని ఆశిస్తున్నారు. స్వార్థం ఉండకూడదు, అయితే స్వార్థం పెరిగిపోయింది. ప్రతి ఒక్కరిలో ఈ స్వార్థం అనే పిశాచి బయలుదేరింది, తాను, తన భార్య, తన పిల్లలు మాత్రం బాగుండాలి.

బయటి ప్రపంచాన్ని గురించి ఆలోచించడానికి వెళ్లడం లేదు మానవుడు. నీతి నియమములు మంట కలసినాయి, తత్వరహిత రాజకీయం, శ్రమరహిత సంపత్తి, నీతిహీన వ్యాపారం, శీలసూన్య శిక్షణ, మనస్సాక్షి లేని సుఖం, మానవత్వరహిత విజ్ఞానం ఈ అరిష్టములన్నీ ఈ దేశంలో పెరిగిపోయినాయి. దీనికి కారణం ఏమి? ఆశలు పెంచుకుంటున్నారు, స్వార్థం పెరిగిపోతోంది. సంపాదించాలి కానీ నీతి నియమముగా సంపాదించడం లేదు, దోచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు మానవుడు.

తనది కాని దాన్ని తీసుకుంటున్నాడు. న్యాయమో , అన్యాయమో ప్రత్యక్షంగానో పరోక్షంగానూ డబ్బు సంపాదించాలి. ఇంజనీర్లకు, డాక్టర్లకి, లాయర్లకి, వ్యాపారస్తులకి, టీచర్లకు, లెక్చరర్లకు అందరికీ ఇదే బుద్ధి ఉంది. కనుక శిష్య భక్తాదులారా మనుషులలో స్వార్థం పెరిగిపోతోంది. ఈ స్వార్థాన్ని అణచుకోవడానికి మానవుడు ప్రయత్నం చేస్తేనే మానవుడు మాధవుడిగా మారుతాడు.

కనుక శిష్య భక్తాదులారా మీరందరూ కూడా స్వార్థాన్ని విడచి, మానవత్వాన్ని పెంచుకొని పరోపకారం చేస్తూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.